క్లుప్తంగా

ఆధునిక వ్యవసాయంతో అధిక దిగుబడి



పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏఓ ప్రవీణ్

తవణంపల్లె: ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని ఏఓ ప్రవీణ్ తెలిపారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా జోగివారిపల్లె, చెంగనపల్లెలో పంటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు అధిక దిగుబడి ఇచ్చే నూతన వంగడాలను ఎంపిక చేసుకుని సాగు చేయడం మంచిదని సూచించారు. అదేవిధంగా పంట మార్పిడి చేయాలని సూచించారు. రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. పంటల సాగులో సకాలంలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి సాధించి రైతులకు ఆదాయం వస్తుందన్నారు. తెగుళ్లు, పురుగులు సోకిన వెంటనే సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటను కాపాడుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రంలో ఎరువులు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో రైతు సేవాకేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు సత్వర పరిష్కారం



మాట్లాడుతున్న తహసీల్దార్ మహేష్‌కుమార్

ఐరాల: రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మహేష్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక సచివాలయ ఆవరణలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాలలో నెలకొన్న భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల్లో అర్జీ సమర్పించి పరిష్కరించుకోవాలని సూచించారు. రైతులు అర్జీలు ఇస్తే 45 రోజుల్లో వాటికి పరిష్కారం చూపుతామన్నారు. మొత్తం 89 అర్జీలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మోహన్, సర్పంచ్ గుణవతి, వైస్ సర్పంచ్ బద్రీనాథ్, మాజీ ఆత్మ చైర్మన్ రాజేష్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: గ్రామాల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత తెలిపారు. మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వీఎస్ అగ్రహారంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 70 మంది రోగులకు వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు ఆకుకూరలు, ప్రోటీన్లు ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ అరుణ,ఏఎన్‌ఎంలు,ఆశావర్కర్లు పాల్గొన్నారు.

డీఎస్పీ కార్యాలయంలో తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని డీఎస్పీ కార్యాలయాన్ని మంగళవారం రాత్రి ఎస్పీ మణికంఠ చందోలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అల్లర్లు, గొడవలకు తావుండరాదని, రోడ్డు భద్రతపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ సాయినాథ్, ఎస్ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ద్రవిడ వర్సిటీలో స్క్రాప్ మెటీరియల్ వేలం

కుప్పం: ద్రావిడ విశ్వవిద్యాలయంలో స్క్రాప్ మెటీరియల్స్ వేలం వేస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.కిరణ్ కుమార్ తెలిపారు. కొనుగోలుదారులు స్వయంగా సంప్రదించి, మెటీరియల్ పరిశీలించి ద్రావిడ విశ్వవిద్యాలయ నమూనా కొటేషన్‌ను లిఖితపూర్వకంగా నింపి సీల్డ్ కవర్ ద్వారా ఈ నెల 28వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటల్లోపు రిజిస్ట్రార్ కార్యాలయంలో సమర్పించాలని కోరారు. మరిన్ని వివరాలకు వర్సిటీ రిజిస్ట్రార్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

జిల్లాలోనే మొదటి చర్చి..



జిల్లాలో మొట్టమొదటగా ఏర్పాటైన చర్చిగా చిత్తూరు టౌన్ చర్చి (సీఎస్ఐ)కి పేరు. బ్రిటీష్ వారి పాలనలో 1855 సంవత్సరంలో ఈ చర్చిని స్థాపించారు. అప్పట్లో డబ్ల్యూ..డబ్ల్యూ విలియమ్ స్కడర్ మిషనరీ వ్యవస్థాపకులుగా వ్యవహరించారు. ఆయనే ఈ చర్చి బాధ్యతలను స్వీకరించారని చర్చి డైరీలో పొందుపరిచారు. ఈ చర్చిలో ప్రతి ఆదివారం జరిగే ఆరాధన కార్యక్రమాలకు 800 మందికి పైగా హాజరవుతుంటారు. క్రిస్మస్ పర్వదినం రోజు సుమారు 2 వేల మందిపైగా చర్చిలో జరిగే ప్రార్థనల్లో పాల్గొంటారు.

ఆంగ్లం లూక్స్ చర్చి ..



నగరంలోని లక్ష్మీనగర్ కాలనీలో ఉన్న సెయింట్‌లూక్స్ చర్చిని 1983లో ఈస్ట్ ఇండియా కంపెనీ వారు మిలిటరీ చర్చి అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మించారు. అప్పట్లో ఇక్కడ ప్రసంగాలు ఆంగ్లంలోనే జరిగేవి. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా కొన్నాళ్ల వరకు ఇక్కడ ఆంగ్లంలోనే ప్రసంగాలు చేస్తున్నారు. ఆ తర్వాత చర్చి బాధ్యతలను సీఎస్ఐ వేలూరు డయాసిస్ సంస్థకు అప్పగించారు. అప్పటి నుంచి తెలుగు ఆరాధన, ప్రసంగాలు చేయడానికి అనుమతి వచ్చింది. ఏటా క్రిస్మస్ సంబరాలు చాలా వైభవంగా నిర్వహిస్తుంటారు.

63 ఏళ్ల జాన్‌బాస్కో చర్చి..



చిత్తూరు నగరం పలమనేరు రోడ్డులోని జాన్ బాస్కో చర్చి కూడా పేరొందింది. వైఎస్సార్ కడప పీఠానికి చెందిన రోమన్ క్యాథలిక్ సంఘం ద్వారా ఈ చర్చి నడుస్తోంది. 1961లో ఈ చర్చిని నిర్మించారు. పునీతులు జాన్‌బాస్కో పేరును ఈ చర్చికి నామకరణం చేశారు. ఇప్పటికి 63 సంవత్సరాలు దాటింది. అనతికాలంలోనే బలమైన సంఘంగా పేరు సంపాదించుకుంది.

చరిత్రకు సాక్ష్యాలు.. చర్చిలు


చిత్తూరులోని పలు చర్చిలు చరిత్రకు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. బ్రిటీష్ కాలంలో నిర్మించిన ఈ చర్చిలు చెక్కు చెదరకుండా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే లోక రక్షకుడు ఏసుక్రీస్తుకు స్వాగతం పలికేందుకు క్రైస్తవులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకోసం చర్చిలను సుందరంగా తీర్చిదిద్దారు. క్రిస్మస్ ట్రీలు, స్టార్‌లతో క్రైస్తవుల ఇంట దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి. అర్ధరాత్రి నుంచే దైవ సేవకులు సందేశం అందించారు.

- చిత్తూరులో ఏళ్ల నాటి ప్రార్థనా మందిరాలు
- క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధం
- రంగు కాగితాలు, ప్రత్యేక పుష్పాలతో డెకరేషన్
- శాంతాక్లాజ్, స్టార్‌లు, క్రిస్మస్ ట్రీల కాంతులు
- ఆకట్టుకునేలా ఏసుజననం తెలిపే పశువుల పాకలు
- అర్ధరాత్రి నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభం

చిత్తూరు రూరల్ : నగరంలో క్రిస్మస్ సందడి నెలకొంది. చర్చిలన్నీ ప్రత్యేకంగా ముస్తాబయ్యాయి. డాన్‌బాస్కో చర్చి, చిత్తూరు టూన్ చర్చి, బీటీ మెమోరియల్ చర్చి, రీడ్స్‌పేట చాపెల్, తెలుగు లూక్స్ చర్చిలతో పాటు పలు చర్చిల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చర్చిలతో పాటు వీధుల్లో కూడా స్టార్, విద్యుత్ దీపాలంకరణలతో కాంతులీనుతున్నాయి. పలుచోట్ల ఏసు జననం తెలిసేలా ఏర్పాటు చేసిన పశువులపాకలు ఆకట్టుకుంటున్నాయి. అలాగే చిత్తూరు మండలంలోని ముత్తుకూరు, కుర్చివేడు, ఆనగల్లు, దిగువకండ్రిగ, అనంతాపురం చర్చిలను సర్వంగా సుందరంగా తీర్చిదిద్దారు.

అర్ధరాత్రి నుంచి ఆరాధనలు

క్రిస్మస్ సందర్భంగా మంగళవారం రాత్రి నుంచే ప్రార్థనలు, ఆరాధన కార్యక్రమాలు, గీతాలపానలు ప్రారంభయ్యాయి. మతబోధకులు చర్చిల్లో ఏసు క్రీస్తు జననంపై ప్రబోధించారు. బైబిల్‌లోని అతి ముఖ్య వాక్యాలను ప్రసంగించారు. సరిగ్గా 12 గంటల సమయంలో బాణసంచా పేల్చి క్రిస్మస్ సంబరాలను ప్రారంభించారు. దీంతో చర్చిల వద్ద సంబరాలు అంబరాన్ని అంటాయి. బుధవారం ఉదయం 9 గంటల నుంచి కూడా అన్ని చర్చిల్లో ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు చర్చి నిర్వాహకులు ముందస్తు ఏర్పాటు పూర్తి చేశారు.



రీడ్స్‌పేట చాపెల్ చర్చి

నగరంలో సందడి

క్రిస్మస్ సందర్భంగా సరుకులు, ఇతరత్రా సామగ్రి కొనుగోలు కోసం వచ్చిన వారితో నగరంలోని చర్చి వీధి, బజారువీధి సందడిగా కనిపించింది. స్టార్‌లు, చర్చిలకు కావాల్సిన అలంకరణ వస్తువులు, దుస్తులు, ఇంటి గృహోపకరణాలు, ఇతరత్రా వాటి కొనుగోలులో వారంతా బిజీబిజీగా కనిపించారు.

వందేళ్లు దాటిన రీడ్స్‌పేట చాపెల్..

నగరంలోని రీడ్స్‌పేటలోని సీఎస్ఐ చాపెల్ 105 ఏళ్లు పూర్తి చేసుకుంది. బ్రిటన్ దేశానికి చెందిన రీడ్స్ అనే జడ్జి ఈ చాపెల్ చర్చిని 1917 జూన్ 1న నిర్మించారు. ఆయన షర్మన్ స్కూల్‌లో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలోనే చాపెల్, ఆ ప్రాంతానికి రీడ్స్‌పేటగా నామకరణం చేశారు.

వినాయకుడి సేవలో పలువురు ప్రముఖులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామిని మంగళవారం మైనారిటీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ హర్షవర్ధన్ దర్శించుకున్నారు. ఈయనకు ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికి స్వామి దర్శనం కల్పించారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో ఆశీర్వచనాలు అందించి స్వామి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఈఓ పెంచలకిషోర్, ఏఈఓ రవీంద్రబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.2 లక్షల ఆస్తి నష్టం

పుంగనూరు: పట్టణ సమీపంలోని యూఎస్ఆర్ సర్కిల్‌లో గల పార్థు బేకరిలో సోమవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగి సుమారు రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం జరిగింది. సమాచారం తెలిసిన వెంటనే అగ్నిమాపకశాఖాధికారి సుబ్బరాజు ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడికి వెళ్లి మంటలు అదుపు చేశారు. ప్రమాదంలో బేకరి వస్తువులు, ఫ్రీడ్జిలు, ఫర్నిచర్, తదితర వస్తువులు కాలిపోయాయి. దీనిపై బేకరి యజమాని తనకు సమీపంలోని వ్యాపారులే ఈ అగ్నిప్రమాదానికి కారణమై ఉంటారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఓంశక్తి అమ్మవారికి పూజలు



ప్రత్యేక అలంకరణలో ఓం శక్తి అమ్మవారు

తవణంపల్లె: మండల కేంద్రంలోని ఓంశక్తి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం ధర్మరాజుల గుడిలో ఓంశక్తి భక్తులు అమ్మవారికి శాస్త్రోక్తంగా అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి దూపదీప నైవేద్యం సమర్పించారు. ప్రత్యేక అలంకరణలోని ఓంశక్తి అమ్మవారు పల్లకిలో కొలువై తవణంపల్లె పురవీధుల్లో దర్శనమిచ్చారు. రాత్రి ఇరుముడులతో ఓంశక్తి భక్తులు మేల్‌మరువత్తూర్ ఓంశక్తి అమ్మవారి ఆలయానికి మొక్కులు తీర్చుకోవడానికి బయలుదేరారు.

అమిత్ షా క్షమాపణ చెప్పాల్సిందే

చిత్తూరు కలెక్టరేట్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కించపరుస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు కచ్చితంగా క్షమాపణ చెప్పాల్సిందేనని కాంగ్రెస్, బహుజన్ సమాజ్ పార్టీల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయా పార్టీల నాయకులు మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం, కలెక్టరేట్ వద్ద వేర్వేరుగా ఆందోళన చేపట్టారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ మాట్లాడుతూ మహోన్నత వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కించపరుస్తూ చట్టసభల్లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా మాట్లాడడం తీవ్ర ఆవేదనకు గురి చేస్తోందన్నారు. ఈ రోజు ప్రతి ఒక్కరూ ఉన్నతమైన పదవుల్లో ఉన్నారంటే అందుకు కారణం అంబేడ్కర్ కల్పించిన ఓటు హక్కేనని చెప్పారు. ప్రపంచ మేధావిని కించపరుస్తూ నోటికి వచ్చినట్లు మాట్లడడం సహించరాని నేరమన్నారు. వెంటనే అమిత్‌షా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

క్షమించరాని నేరం..

అంబేడ్కర్‌ను కించపరిచేలా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మాట్లాడడం క్షమించరాని నేరమని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల పార్లమెంటు సమావేశంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమాన పరిచేలా మాట్లాడిన అమిత్‌షాపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని డిమాండ్ చేశారు. అనంతరం కాంగ్రెస్, బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు గుర్రప్ప, జిల్లా అధ్యక్షుడు సురేంద్రబాబు, నాగేశ్వర్ రావు, లోకనాథం, ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్


డిటెన్షన్ విధానం వద్దే వద్దు




మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

చిత్తూరు కలెక్టరేట్ : డిటెన్షన్ విధానం వద్దే వద్దని యూటీఎఫ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో ఆదేశ సూత్రాలలో 6–14 సంవత్సరాల పిల్లలకు ఉచిత ప్రాథమిక నిర్బంధ విద్య అందించాలన్నారు. అందుకు భిన్నంగా 2009లో వచ్చిన విద్యాహక్కు చట్టాన్ని సవరించడం అన్యాయమని చెప్పారు. ఐదు, ఎనిమిది తరగతుల పిల్లలకు డిటెన్షన్ విధానం ప్రవేశపెట్టడంపై పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ విద్య సామాజిక అంతరాలను తగ్గించాలని చెప్పారు. అయితే అందుకు భిన్నంగా డిటెన్షన్ విధానం ఉందని ఆరోపించారు. ఈ విధానంతో పేద విద్యార్థులకు విద్యను దూరం చేసినట్లేనని చెప్పారు. జాతీయ విద్యా విధానం పేరుతో ఇలాంటి అశాస్త్రీయ విధానాలను కేంద్రం అమలు చేయడం దారుణమన్నారు. రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఉండే విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని డిటెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్య కార్పొరేటీకరణ కాకుండా, ప్రభుత్వ విద్యా రంగం బలోపేతం కావడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన డిటెన్షన్ విధానాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేయకుండా నాన్ డిటెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం సోమశేఖర్ నాయుడు, ఎస్ మణిగండన్, నాయకులు పి.సుధాకర్ రెడ్డి, కే రెడ్డప్ప నాయుడు, ఎస్ రెహానా బేగం, దక్షిణామూర్తి, సరిత తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు



బృందావనం పాఠశాలలో



న్యూయార్క్ పాఠశాలలో

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని వివిధ పాఠశాలల్లో మంగళవారం ముందస్తుగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. నగరంలోని సంతపేట వద్ద ఉన్న బృందావనం, మురగానపల్లిలోని న్యూయార్క్, సుందరరాజపురంలోని విజయం పాఠశాలల్లో ఘనంగా క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు. విద్యార్థులు క్రిస్మస్‌తాత, మేరీమాత, శాంతాక్లాజ్, ఏసు దేవదూతల వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నారు. న్యూయార్క్ పాఠశాలలో చైర్మన్ శ్రీధర్, విజయం పాఠశాల చైర్మన్ తేజోమూర్తి, బృందావనం పాఠశాలలో కరస్పాండెంట్ శైలజ పాల్గొన్నారు.

సచివాలయ రికార్డుల తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్

గుడిపాల: మండలంలోని 197రామాపురం సచివాలయం, అంగన్‌వాడీ, హెల్త్‌సెంటర్‌లను తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయంలో రికార్డులు, అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. హెల్త్‌సెంటర్‌లో రోజుకు ఎంతమంది రోగులు వస్తున్నారు ? వైద్యం ఎలా అందుతోంది ? అనే అంశాలపై ఆరా తీశారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు.

పాకలోన సందడాయే.. లోకమంతా పండగాయే



తవణంపల్లెలో విద్యుద్దీపాలంకరణలో చర్చి

కరుణామయుడు..ఏసు రాకకై భక్తజనం వేచిచూస్తున్న వేళ.. బాల ఏసు జననంతో పాకలోన సందడి కావడంతో.. లోకమంతా పండుగ అయింది.. ఏసు తన బోధనలతో విశ్వవాళికి శాంతిని పంచారు. క్రిస్మస్ సందర్భంగా అంతటా చర్చిలను సుందరంగా తీర్చిదిద్దారు. రంగులు వేసి విద్యుద్దీపాలతో అలంకరించారు.

– తవణంపల్లె/బంగారుపాళెం/గుడిపాల



గుడిపాల: విద్యుద్దీప కాంతుల్లో రాసనపల్లె చర్చి



బంగారుపాళెం: ముంగరమడుగులో ముస్తాబైన చర్చి



గుడిపాల: అలంకరణలో పాల్‌పురం చర్చి